మురుగుతో ముప్పతిప్పలు


సచివాలయం దారిలో మురుగు నీటిలోంచి వస్తున్న వాహనచోదకుడు


చెరువులోకి ప్రవహిస్తున్న మురుగునీరు

- అస్తవ్యస్తంగా శివశక్తినగర్–నగరంపాలెం రోడ్డు
- చెరువుకూ అపారిశుధ్యం తెగులు

మధురవాడ: జీవీఎంసీ జోన్‌–2లోని శివశక్తినగర్‌–నగరంపాలెం మాస్టర్‌ ప్లాన్‌ రోడ్లను అనుసంధానం చేసే గ్రావెల్‌ రోడ్డుపై బొట్టవానిపాలెం చెరువు వద్ద నిత్యం మురుగు నీరు పారుతుండడంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 5వ వార్డులోని 70, 71 వార్డు సచివాలయాలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. ఏ పని మీద వెళ్లాలన్నా బొట్టవానిపాలెంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన శివశక్తినగర్, శ్రీలక్ష్మీనగర్, ముత్యాలమ్మ కాలనీ, సద్గురు సాయినాథ కాలనీలకు చెందిన 2 వేలకు జనం ఈ మురుగులో నుంచే సచివాలయాలకు వెళ్లాలి. అలాగే నగరంపాలెం, మల్లయ్యపాలెం, ఆయోధ్యనగర్‌ పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ఎటు వెళ్లాలన్నా ఈ రోడ్డే శరణ్యం. అలాగే బొట్టవానిపాలెంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు చెందిన సగం మంది విద్యార్థులకు కూడా ఈ కంకర రోడ్డే ఆధారం. పైగా బొట్టవానిపాలెం చెరువు నుంచి శివశక్తినగర్‌ రోడ్డులో ఉన్న పలు నివాసాలతో పాటు అపార్ట్‌మెంట్‌కు చెందిన మురుగునీరు అంతా ఈ రోడ్డుపై నుంచే ప్రవహించి చెరువులోకి చేరుతోంది. చిన్న పాటి వర్షం కురిసినా మురుగు, వర్షంనీరు కలిసిపోయి అడుగు తీసి అడుగు వెయ్యలేని పరిస్థితి. పైగా గ్రావెల్, మట్టితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏళ్ల తరబడి ఇలాంటి పరిస్థితే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కలుషితమవుతున్న చెరువు..

మధురవాడలో ఉన్న విశాలమైన చెరువుల్లో ప్రథమమైనది బొట్టవానిపాలెం చెరువు. దీని వైశాల్యం సుమారు 4 ఎకరాలు. ఇది కొంత కాలం వరకు మంచి నీటితో ప్రజల అవసరాలు తీర్చేది. కానీ ఇప్పుడు ఈ చెరువు కూడా కలుషితం అవుతోంది. అధికారులు తక్షణమే స్పందించి మురుగు సమస్య పరిష్కారానికి, పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

స్పందనలో కూడా ఫిర్యాదు చేశాం..



పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ల నీరు రోడ్డు మీదకి, ఆపై చెరువులోకి వచ్చేస్తోంది. అధికారులు ముందు చూపు లేకుండా ప్లాన్లు ఇవ్వడం వల్లే ఇబ్బందులు వచ్చాయి. మురుగు సమస్యతో వేలాది ప్రజలు, రెండు స్కూళ్లకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడున్నారు. ఈ సమస్యలపై స్పందనలో కూడా ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–ఎం. సూరిబాబు, ఉపాధ్యాయుడు, బొట్టవానిపాలెం

తక్షణ చర్యలు చేపడతాం..



ఈ విషయం ఇంత వరకు మా దృష్టికి రాలేదు. తక్షణమే పరిశీలించి చర్యలు చేపడతాం. సచివాలయాలకు వెళ్లే రోడ్డు మార్గం రాకపోకలకు ఇబ్బంది లేకుండా సరి చేస్తాం. ముఖ్యంగా మురుగు నీరు రోడ్డు మీద పారకుండా చర్యలు చేపడతాం.

–కె. కనకమహాలక్ష్మి, జోనల్‌ కమిషనర్‌.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


స్ప్రింగ్‌ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలతో పాటు, పాలన కూడా ఇంటి మంగిటకే పాలన అందిస్తున్న యువ ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం సాయంత్రం 55వ వార్డు సచివాలయం పరిధిలోని మిథిలాపురి వుడా కాలనీ, కార్వేలి లే అవుట్‌ పరిసర ప్రాంతాల్లో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఇళ్లకి వెళ్లి ప్రజల సమస్యలు, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా తన కుటుంబానికి రు. 1,62,029 లబ్ధి చేకూరిందని జి. సాయిరామ్‌ కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌ రైతు భరోసా, అమ్మ ఒడి, ఇళ్లు తదితర పథకాల ద్వారా రు.3,00,500 లబ్ధి జరిగిందని బి. శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజనల్‌ కోఆర్డినేటర్‌ వంకాయల మారుతీప్రసాద్, సింహాచలం దేవస్థాన ట్రస్ట్‌ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్‌. బాబ్జి ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు పెంట్ర అప్పన్న, పిళ్లా సూరిబాబు, చేకూరి రజని, జగ్గుపిల్లి నరేష్, అల్లాడ లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి


కోలాటమాడుతున్న గెద్దపేట కళాకారులు

తగరపువలస: స్థానిక వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విష్వక్సేనుడు, గరుడాళ్వార్, వకుళ మాత, వరదరాజుస్వామి, యోగ నరసింహస్వామి, బేడీ ఆంజనేయస్వాముల విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భాగంగా వేద పారాయణ, విష్వక్సేన పూజ అనంతరం విగ్రహాలు, పసిడి కలశ ప్రతిష్ఠా, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలిమేలు మంగ, పద్మావతి, వెంకటేశ్వరస్వాములకు కల్యాణ వేడుక నిర్వహించారు. పద్మనాభం మండలం గెద్దపేటకు చెందిన కోలాట బృందంచే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే ముత్తంశెట్టికి ఆలయ ధర్మకర్త కుసుమహర ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు. ముత్తంశెట్టి వెంట అక్కరమాని రామునాయుడు, జగుపల్లి ప్రసాద్, మాల్యాద్రి ఉన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌ మృతులకు నివాళి


ఎయిడ్స్‌ మృతులకు నివాళులు అర్పిస్తున్న సిబ్బంది

మధురవాడ: ఎయిడ్స్‌ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, అభిమానం కనబరచాలని, వారిని నిరాదరణకు గురి చేయరాదని మధురవాడ గాయిత్రి విద్యా పరిషత్‌ ఏఆర్‌టీసీ సెంటర్‌ సిబ్బంది అన్నారు. ఏఆర్‌టీ అండ్‌ ఐసీటీసీ సెంటర్ల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌ కౌన్సిలర్లు ఎయిడ్స్‌ గురించి అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎయిడ్స్‌ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

జగనన్న ఆణిముత్యాలకు ఐదుగురి ఎంపిక



జగనన్న ఆణిముత్యాల పురస్కారానికి ఎంపికైన విద్యార్థినులు

భీమునిపట్నం: ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఇక్కడి ఏపీ బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాల పురస్కారానికి ఎంపికైనట్టు సోమవారం గురుకుల ప్రిన్సిపాల్‌ కోడి రాంబాబు తెలిపారు. ఇందులో జిల్లా స్థాయిలో జామి కల్పన 591 మార్కులు సాధించగా, ఎం.తేజశ్రీ 588 మార్కులు, కే.సాయి 586, కె.నిహారిక 586, ఎస్‌.సౌజన్య 586 మార్కులు సాధించి పురస్కారాలకు ఎంపికయ్యారు. కాగా వీరిని ఈనెల 27న జిల్లాస్థాయిలో సత్కరించనుండగా, 31న రాష్ట్రస్థాయి పురస్కారాలు అందిస్తారని వెల్లడించారు.

స్పందనకు ఐదు వినతులు


జోనల్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌కు వినతి అందిస్తున్న వ్యక్తి

భీమునిపట్నం: భీమిలి జోనల్‌ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, రెవెన్యూ విభాగానికి రెండు, ఇంజినీరింగ్‌ విభాగానికి ఒక వినతి వచ్చాయి. వీటిని జోనల్‌ సూపరింటెండెంట్‌ ఎస్‌.శ్రీనివాస్‌ స్వీకరించారు.

విద్యుత్‌ సరఫరాకు అంతరాయం రేపు

ఆనందపురం: మండలంలోని పలు ప్రాంతాలకు బుధవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్‌ స్టేషన్‌ ఏఈఈ ఎ.సురేష్‌ కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు. లైన్లు మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా పెద్దిపాలెం, పాడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, కుసులువాడ, గొల్లలపాలెం, జగన్నాథపురం, వెంకటాపురం, బంటుబిల్లి కళ్లాలు, పల్లిపేట గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అన్ని గృహ, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

న్యాయం చేయండి

మహారాణిపేట: భీమునిపట్నం మండలంలో సింగనబందలో తమ స్థలానికి సంబంధించిన రికార్డుల్లో ఇతరుల పేర్లు తొలగించి న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్‌ కార్యాలయం ఎదుట సింగనబంధ, లక్ష్మీపురం, మజ్జిపేట, దాకమర్రి, అల్లుపేట రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఆవాల నరసయ్య, ఆవాల ముత్యాలు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ బి.గంగారావు, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జీవ సమతుల్యత


జీవ సంరక్షణపై నాటిక ప్రదర్శిస్తున్న డైట్‌ ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ తమ పరిధిలో జీవ సమతుల్యతకు సహకారం అందించాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్‌) ప్రిన్సిపాల్‌ యు.మాణిక్యం నాయుడు పిలుపునిచ్చారు. డైట్‌ వద్ద సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అందరూ జీవ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, ఇందు కోసం ప్రకృతిలో అన్ని సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రకృతిని దెబ్బతీసే పనులు చేయకుండా దాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని కోరారు. దీనికి సంబంధించి ఆవశ్యకతలను రాబోయే రోజుల్లో ఛాత్రోపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పి వారు మంచి చేసే విధంగా చూడాలన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు ఎస్‌.కె.అల్లావుద్దీన్, ఎస్‌.త్రినాథరావు, గొట్టేటి రవి, మహాలక్ష్మి, హరిణి పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్‌ ఆత్మహత్య

పీఎం పాలెం: చేసిన అప్పులు తీర్చలేనేమో అన్న బెంగతో ఓ ఆటోడ్రైవర్‌ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం లా–అండ్‌ ఆర్డర్‌ ఎస్‌ఐ సోమరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ గణేష్‌నగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న పప్పల రామమోహన్‌రావు ఆటో డ్రైవరు. తన ఆటోలో ప్రయాణికుల రవాణాతో పాటు షాపులకు వాటర్‌ బాటిళ్లు వేస్తుంటాడు. భార్య రమణి ఇద్దరు పిల్లలను తీసుకుని శనివారం అరిలోవలో నివసిస్తున్న తమ్ముడి వివాహ శుభకార్యానికి వెళ్లింది. ఆరోజు సాయంత్రం 7 గంటలకు తల్లి వడ్డించగా భోజనం చేసి తనగదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటల వరకూ అతను లేవకపోవడంతో తల్లి సన్యాసమ్మ లేపడానికి వెళ్లింది.

తలుపులు లోపల గడియ పెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరచి చూడగా కొడుకు డోరు కర్టెన్‌తో ఉరి వేసుకుని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ సోమరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కేజీహెచ్‌కు తరలించి, మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జోన్‌–2 'స్పందన'కు 14 అర్జీలు


జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

మధురవాడ: జీవీఎంసీ జోన్‌–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్‌ కమిషనర్‌ కనకమహాలక్ష్మి 14 వినతులు స్వీకరించారు. రహదారులు, మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించి రోడ్లు విస్తరించాలని మధురవాడ శ్రీసాయి రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కి చెందిన ఎం.వెంకటరావు తదితరులు కోరారు. ఎండా సిగ్నల్‌ వద్ద గల చెరువుపై లైట్లు వెలిగించి, హద్దులు గుర్తించాలని, పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టాలని, రహదారిలో ఆక్రమణలు తొలగించి విస్తరించాలని ఎండాడ శ్రీ పోలమాంబ వర్కర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మధుసూధన రెడ్డి తదితరులు విన్నవించారు. పరదేశిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పీపీ–1 కాలనీకి బోయిపాలెం 40 అడుగుల రోడ్డు నుంచి తన భూమిలో రహదారి నిర్మించాలని వి.నాగేశ్వరరావు వినతిపత్రం అందించారు. ఎంవీవీ సిటీ వద్ద మెయిన్‌ రోడ్డులో స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎంవీవీ సిటీ ఫౌండేషన్‌ ప్రతినిధులు కోరారు. క్రికెట్‌ స్టేడియం నుంచి బింద్రానగర్‌ వరకు ప్రవహిస్తున్న డ్రైనేజీ పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని షిప్‌యార్డు లేఅవుట్‌ బింద్రానగర్‌ హౌస్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు చెందిన ఏఎం ప్రసాద్‌ తదితరులు విజ్ఞప్తి చేశారు. నగరంపాలెం మాస్టర్‌ ప్లాన్‌ రోడ్డు మధురవాడకే మొదటిదని, పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రవికుమార్‌ తదితరులు కోరారు. స్వతంత్రనగర్‌లోని హుద్‌హుద్‌ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని నివాసులు వి.ఎల్లమ్మనాయుడు తదితరులు కోరారు. రోడ్డుపై దుకాణాలు తొలగించొద్దని రైతుబజార్‌ రోడ్డులో చిల్లర వ్యాపారులు కోరారు. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనకమహాలక్ష్మి హామీ ఇచ్చారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించండి

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేటకు లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు సోమవారం ఏఈ జగన్మోహనరావుకు వినతిపత్రం ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్, కండక్టర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. పదేళ్ల నుంచి తమ గ్రామంలో లో వోల్టేజీ సమస్య ఉండటంతో ప్రతి ఐదు రోజుల కొకసారి వైర్లు, ఫీజులు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్‌ సరఫరా పూర్తిగా ఉండటం లేదని తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూ నష్ట పరిహారం పెంచాలని వినతి

ఆనందపురం: మండలంలోని జగన్నాథపురంలో గ్రేహౌండ్స్‌ నిర్మాణం కోసం సేకరించిన భూముల నష్టపరిహారం విషయంలో తమకు అన్యాయం జరిగిందని పలువురు దళితులు సోమవారం తహసీల్దార్‌ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. జగన్నాథపురం సర్వే నంబర్‌ 1/1లో 16 మంది దళితులు 36 ఏళ్లుగా 30 ఎకరాలను కేటాయించగా సాగు చేసుకొని జీవిస్తున్నామని, ఆ భూమిని కూడా గ్రేహౌండ్స్‌ కోసం తీసుకున్నారని, సాగుదారులుగా కాకుండా ఆక్రమణదారులగా గుర్తించడం వల్ల నష్ట పరిహారం మంజూరు విషయంలో నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేసి తగిన విధంగా నష్టపరిహారం అందజేయాలని కోరారు.

కిక్‌ బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ

పీఎం పాలెం: మహా విశాఖ కిక్‌ బాక్సింగ్‌ అసోసియేషన్‌ పర్యవేక్షణలో పీఎం పాలెం అవంతి ఫంక్షన్‌ హాల్‌లో కిక్‌ బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభించామని శిక్షకుడు పెదిరెడ్ల బాబూరావు తెలిపారు. సమ్మర్‌ క్యాంప్‌లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. 6 నుంచి 20 ఏళ్ల వయసు లోపు బాలబాలికలు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సేవా వజ్ర అవార్డు పొందిన దుర్గారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల సేవలు అమోఘమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోనిలో సోమవారం భీమిలి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ బోని అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలంటీర్లకు సత్కారం చేసి, రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా వంటి కష్ట కాలంలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించిన వలంటీర్లు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రులని కొనియాడారు. వలంటీర్లను ఏర్పాటు చేసిన మొదట్లో సంచులు మోయడానికి పనికి వస్తారని చంద్రబాబునాయుడు హేళన చేశారని, కానీ నేడు వారి పనితనం చూసి తాము అధికారంలోకి వస్తే కొనసాగిస్తామని మాయ మాటలు చెబుతున్నారని చెప్పారు. భీమిలి నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా జరిగిన అభివృద్ధిపై ఓపెన్‌ ఛాలెంజ్‌కు తాను సిద్ధమని దమ్ముంటే టీడీపీ నాయకులు ముందుకు రావాలని సవాల్‌ విసిరారు. నియోజకవర్గంలో 50 వేల మందికి కోట్లాది రూపాయల విలువ చేసే ఇళ్ల స్థలాలను పేదలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని 18 సచివాలయాల పరిధిలో గల 298 మంది వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల కింద రూ.29.70 లక్షల నగదు మంజూరు పత్రాలు, ప్రశంసా పత్రాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, ఎంపీడీవో అడపా లవరాజు, తహశీల్దారు లోకవరపు రామారావు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు బోని అప్పలకొండ, బోని పార్వతమ్మ, వైస్‌ ఎంపీపీలు పాండ్రింకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మజ్జి వెంకటరావు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, బోని సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

తగరపువలస: వలంటీర్ల సేవలు విలువ కట్టలేనివని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం భీమిలి మండలం రేఖవానిపాలెంలో సేవా మిత్ర, సేవా రత్న అవార్డులు లభించిన వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. స్థానిక సర్పంచ్‌ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్‌ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్‌ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్‌ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, జీరు వెంకటరెడ్డి, దుంపల ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కాద సూర్యనారాయణ, చెల్లూరి పైడప్పడు, చెల్లూరి నగేష్, మజ్జి శ్రీనివాసరావు, పాట్నూరు చంద్రశేఖర్, శిరిగుడి ఈశ్వరరావు, బోని సన్నిబాబు, వెంపాడ సూరిబాబు, తోట ఎల్లారావు, బొడ్డు దుర్గారావు, మేరుగు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి అవార్డులు..

భీమిలి మండల పరిధిలో గ్రామ సచివాలయాలకు సంబంధించి ప్రభుత్వంచే ఐదుగురికి సేవారత్న, 158 మందికి సేవా మిత్ర అవార్డులు లభించినట్టు ఎంపీడీవో పి.వెంకటరమణ తెలిపారు. మండలంలోని 330 వలంటీర్‌ పోస్టులు మంజూరయ్యాయన్నారు. నలుగురు వలంటీర్లకు ఏడాది సర్వీస్‌ పూర్తి కాకపోగా ఒక వలంటీర్‌ పోస్టు ఖాళీగా ఉందన్నారు. 66 మంది వలంటీర్లు అర్హత సాధించినా వారికి ఎలాంటి అవార్డు రాలేదన్నారు. వీరి జాబితా ప్రభుత్వానికి మళ్లీ పంపించినట్టు తెలిపారు.

గొప్ప సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్‌


రాజా రామ్మోహన్‌రాయ్‌కి నివాళులు అర్పిస్తున్న ఆదర్శప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: భారతదేశ మొట్టమొదటి సామాజిక మత సంస్కరణల ఉద్యమకారుడు రాజా రామ్మోహన్‌రాయ్‌ అని ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్‌.ఆర్‌.కృష్ణారావు అన్నారు. సోమవారం రాయ్‌ 350వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రిటీష్‌ ఇండియా కాలంలో సతీసహగమన సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి కృషి చేశారన్నారు. కందుకూరి వీరేశలింగం కూడా గొప్ప సంస్కర్తగా మారడానికి రాయ్‌ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, కాసరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


మొక్క నాటుతున్న దృశ్యం

కొమ్మాది: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతను వ్యక్తిగతంగా తీసుకుని వాటిని సంరక్షించాలని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ జి.చిన్నబాబు పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం స్థానిక భవన్‌ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముందుగా స్వచ్ఛ భారత్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడమే కాకుండా కార్యాలయ పరిశుభ్రతకు సిబ్బంది ఆరోగ్యకరమైన వాతావరణంలో రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహించడానికి దోహద పడుతుందన్నారు. మిషన్‌ డైరెక్టర్‌ ఈసా రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వేలంపాట వాయిదా

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో సీజ్‌ చేసిన 360 టన్నుల చెరువు మట్టికి సోమవారం జరగాల్సిన వేలం పాట వాయిదా పడింది. పాడటానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో రెవెన్యూ అధికారులు వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు వేలం నిర్వహిస్తారనేది తేదీ నిర్ణయించలేదు.